క్లుప్తంగా

బాల్య వివాహాల నిషేధంపై అవగాహన



గుంటూరు రూరల్: బాల్య వివాహాలు చట్ట ప్రకారం నేరమని, ఉమెన్ అండ్ చైల్డ్ ప్రొటెక్షన్ డిపార్ట్‌మెంట్ జిల్లా అధికారి విజయ్‌కుమార్ తెలిపారు. మంగళవారం మండలంలోని అంకిరెడ్డిపాలెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలో విద్యార్థులకు బాల్య వివాహాల నిషేధంపై అవగాహన సదస్సు నిర్వహించారు. బాల్య వివాహాలు వల్ల కలిగే దుష్పరిణామాలు వివరించారు. సచివాలయ మహిళా పోలీసు సుగుణకుమారి విద్యార్థులకు బాల్యం, మానసిక పరిపక్వత గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది, వలంటీర్స్, స్కూల్ సిబ్బంది, డ్వాక్రా, ఆశా, అంగన్వాడీ టీచర్స్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అప్పాపురం చానల్‌లో తూటికాడ తొలగింపు



చేబ్రోలు: ఖరీఫ్ సీజన్‌లో కాలువల్లో సాగునీటి పారుదలకు సమస్యలు ఎదురు కాకుండా ఉండేందుకు పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య సూచనల మేరకు ఇరిగేషన్ శాఖ అధికారులు ముందు జాగ్రత్త చర్యలు సోమవారం చేపట్టారు. చేబ్రోలు, వట్టిచెరుకూరు, కాకుమాను, పెదనందిపాడు మండలాలకు సాగు నీరు అందించే అప్పాపురం చానల్‌లో తూటికాడ పెరిగి నీటి ప్రవాహానికి ఆటంకం కలుగుతుంది. అధిక వర్షాల సమయంలో తుంగ, తూటికాడ అడ్డుపడి పొలాలు ముంపు బారిన పడుతున్నాయి. స్థానిక రైతులు విషయాన్ని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య దృష్టికి తీసుకువెళ్లటంతో యుద్ధప్రాతిపదికన తూటికాడ తొలగింపు పనులను యంత్రాలతో చేపట్టారు.

వాటర్‌ట్యాంక్ నిర్మాణానికి స్థల పరిశీలన



గుంటూరు రూరల్: చిన్న పలకలూరు గ్రామంలో తాగునీటి వసతి కల్పించేందుకు వాటర్ ట్యాంక్ ఏర్పాటుకు మండల వెస్ట్ తహసీల్దారు సాంబశివరావు మంగళవారం స్థల పరిశీలన చేశారు. జెడ్పీటీసీ తుమ్మల సుబ్బారావు గ్రామ ప్రజల తాగునీటి సమస్యను తహసీల్దారుకు వివరించారు. వాటర్ ట్యాంక్ నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరారు. దీంతో స్థల పరిశీలన చేపట్టినట్లు తహసీల్దారు తెలిపారు. కలెక్టర్‌కు నివేదిక పంపనున్నట్లు వెల్లడించారు.

జారిపడి వృద్ధుడి మృతి

చేబ్రోలు: ప్రమాదవశాత్తూ బాత్రూంలో వృద్ధుడు జారిపడి.. వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన సోమవారం జరిగింది. చేబ్రోలు ప్రాంతానికి చెందిన కూనిశెట్టి వెంకటేశ్వర్లు (75) ఈ నెల 16న ఇంటిలోని బాత్రూంలో కాలుజారి పడ్డాడు. కుటుంబ సభ్యులు అతనిని గుంటూరులోని వైద్యశాలకు తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ వెంకటేశ్వర్లు మరణించాడు. మృతుని కుమారుడు ఫిర్యాదు మేరకు ఎస్ఐ కె.ఆనంద్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఆశ వర్కర్ల ధర్నా

గుంటూరు మెడికల్: గుంటూరు డీఎంహెచ్‌ఓ కార్యాలయం ఎదుట మంగళవారం ఆశ వర్కర్లు ధర్నా చేశారు. తమకు ఆన్‌లైన్‌లో యాప్‌లు ఎక్కువగా చేయమని, విధులు కేటాయించారని, వాటి ద్వారా తాము ఇబ్బందులు పడుతున్నామని, వాటిని తగ్గించాలని కోరారు. తమ డిమాండ్‌లను నెరవేర్చాలని కోరుతూ డీఎంహెచ్‌ఓ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబుకు వినతి పత్రం అందజేశారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

తాడికొండ: నిబంధనలకు విరుద్ధంగా తుళ్లూరు మండలం పెదపరిమి నుంచి గుంటూరు మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ నాగార్జున వివరాలు.. అందిన సమాచారం మేరకు తనిఖీలు చేయగా కారులో తరలిస్తున్న 249 మద్యం బాటిళ్ల బీర్లను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.48వేలు ఉంటుందని తెలిపారు. కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

యూనివర్సల్ కళాశాలలో సదస్సు

మేడికొండూరు: మండల పరిధిలోని జోకిపద్రులోని యూనివర్సల్ ఇంజినీరింగ్ కళాశాలలో మాదకద్రవ్యాలపై అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. ఎస్ఐ మధుపవన్ విద్యార్థి దశలో సరైన మార్గంలో నడుచుకోవాలని సూచించారు. యువజన వ్యవహారాల విభాగం ఇన్‌చార్జిలు వాసంతి, రాధిక శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపల్ కేశవరెడ్డి, కరస్పాండెంట్ ఫాతిమా మర్రెడ్డి, డిప్లొమో విభాగ ప్రిన్సిపల్ జయరామిరెడ్డి పాల్గొన్నారు.

ప్రజల దీవెనలే జగనన్నకు శ్రీరామరక్ష

- పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య
- శేకూరు, శలపాడు గ్రామాల్లో 'జగనన్న సురక్ష'
- రెడ్డిపాలెం 'జగనన్న సురక్ష' శిబిరంలో ఎమ్మెల్యే మేకతోటి సుచరిత



శలపాడులో మహిళకు ధ్రువపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య



మహిళకు ధ్రువపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మేకతోటి సుచరిత

చేబ్రోలు: అర్హులైన ప్రతి ఒక్కరికి కుల, మత, వర్గ, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల దీవెనలే శ్రీరామరక్ష అని పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అన్నారు. శేకూరు, శలపాడు గ్రామాల్లో సోమవారం జగనన్న సురక్ష శిబిరాలు జరిగాయి. శేకూరులో ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య మాట్లాడుతూ అర్హులై ఉండి, సాంకేతిక, ఇతర కారణాలతో సంక్షేమ పథకాలను అందని వారిని గుర్తించి, వారికి లబ్ధి చేకూర్చేందుకు అత్యంత ప్రతిష్టాత్మకంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'జగనన్న సురక్ష పథకం' తీసుకొచ్చారని తెలిపారు. ప్రతి ఇంట్లో ఏ చిన్న సమస్య ఉన్నా దానిని పరిష్కరించనున్నట్లు చెప్పారు. ప్రతిపక్షాలు ప్రజలను మభ్యపెట్టి, మాయ చేయటానికి కుట్రలు, చౌకబారు విమర్శలు చేస్తున్నాయని మండిపడ్డారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలను ఇంటి వద్దకే అందిస్తున్నారని తెలిపారు. ఎక్కడో ఒక చోట జరిగిన సంఘటనను చూపి, వలంటీర్ వ్యవస్థ మొత్తాన్ని రద్దు చేయాలని విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అభివృద్ధిని అడ్డుకోవటానికి ప్రయత్నిస్తున్నారని ప్రజలు వాస్తవాలను గమనించాలని ఎమ్మెల్యే కిలారి కోరారు. శేకూరు గ్రామంలో రూ.20కోట్ల లబ్ధిని సంక్షేమ పథకాల ద్వారా అందించినట్లు తెలిపారు. రూ.1.16కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. హౌస్‌హోల్డ్ సర్వేలో అర్జీలు పెట్టుకొన్న 501మందికి ఉచితంగా వివిధ ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఎంపీపీ కె.సాహితి, తహసీల్దారు కేవీ గోపాలకృష్ణ, ఎంపీడీవో బి.బాబురావు, శేకూరు, వీరనాయకునిపాలెం గ్రామ సర్పంచ్‌లు మాతంగి శ్యామల, యర్రాకుల అనితాకుమారి, డీసీఎంఎస్ డైరక్టర్ కుర్రా పాములు, సొసైటీ అధ్యక్షుడు చందు సాంబశివరావు, ఎంపీటీసీ శివయ్య, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. శలపాడు గ్రామ శిబిరంలో మన్నెం శిరీష, ఎం.వేణుగోపాలరావు, యు.బాలచంద్రయ్య, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే.. శలపాడు గ్రామానికి చెందిన గుమ్మిడాల అనూజారాణికి ఇళ్ల పట్టాలకు అర్హురాలైనప్పటికీ సాంకేతిక కారణాలతోతో లబ్ధి పొందలేకపోయింది. ఆమె సమస్యను గుర్తించిన తహసీల్దారు కేవీ గోపాలకృష్ణ జగనన్న సురక్ష శిబిరంలో అనూజారాణికి ఇంటి స్థలం పట్టాను ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య చేతుల మీదుగా అందజేశారు. ఇంటి స్థలం పట్టాను అందుకున్న మహిళ ఆనందం వ్యక్తం చేసింది.

అర్హులకు పథకాలు అందించడమే లక్ష్యం

రేటూరు(కాకుమాను): గ్రామాల్లో అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టినట్లు జెడ్పీటీసీ సభ్యురాలు ముజావర్ షేక్ గుల్జార్ బేగం అన్నారు. మండలంలోని రేటూరు గ్రామ సచివాలయం వద్ద మంగళవారం జగనన్న సురక్ష శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అర్జీదారులకు వివిధ రకాల సర్టిఫికెట్‌లను ఆమె పంపిణీ చేశారు. సచివాలయ సిబ్బందికి మెమెంటోలను అందజేశారు. గ్రామ సర్పంచ్ షేక్ సైదా, ఉప సర్పంచ్ వల్లూరి సుధాకర్, సొసైటీ అధ్యక్షులు వల్లూరి పండు, మండల కో–ఆప్షన్ సభ్యులు షేక్ సుభాని, తహసీల్దారు జె.ప్రసాదరావు, ఎంపీడీఓ రామకృష్ణ, ఏవో కె.కిరణ్మయి, ఏపీఓ సింగారావు, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి 'జగనన్న సురక్ష' వేదిక

పెదకాకాని: ప్రజా సమస్యలను పరిష్కరించడానికి జగనన్న సురక్ష కార్యక్రమం దోహదపడుతుందని ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు అన్నారు. పెదకాకాని వెంగళరావునగర్, పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ సభలో ఎంపీపీ శ్రీనివాసరావు పాల్గొన్నారు. కొత్త రేషన్‌కార్డులు, రైతులకు అడంగల్ పత్రాలు, కౌలు కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డులు వంటి అంశాలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ల జ్యోతి, సర్పంచి గోళ్ళ స్వరూపరాణి, ఎంపీడీవో బీవీ మల్లేశ్వరరావు, తహసీల్దారు పి.రత్నం, శివాలయం చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు, మండల కన్వీనర్ చాగంటి మురళీమోహన్ రెడ్డి, ఈఓపీఆర్డీ డి.రామాంజనేయులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష' పేదలకు వరం

గుంటూరు రూరల్: జగనన్న సురక్ష కార్యక్రమం పేదలకు వరంలాంటిదని రూరల్ మండలం జెడ్పీటీసీ తుమ్మల సుబ్బారావు తెలిపారు. మంగళవారం మండలంలోని తురకపాలెం గ్రామంలో జగనన్న సురక్ష శిబిరం నిర్వహించారు. జెడ్పీటీసీ ఈ కార్యక్రమంలో పాల్గొని, మాట్లాడారు. అర్హత ఉంటే ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను ఇంటి వద్దకే అందించిన మహా నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని కొనియాడారు. వైఎస్ ఎంపీపీ ఇంటూరి పద్మావతి మాట్లాడుతూ జగనన్న ప్రవేశపెట్టిన నవరత్నాల పథకాలు ప్రతి కుటుంబానికి అందుతున్నాయన్నారు.ఎంపీడీవో శోభరాణి, వెస్ట్ తహసీల్దారు సాంబశివరావులు మాట్లాడుతూ 297 మందికి కుల ధ్రువీకరణ, 265 మందికి ఆదాయ ధ్రువీకరణ, 14 మందికి పంటసాగు, 9 మందికి ఆధార్ సేవలు 13 ఇతర ధ్రువ పత్రాలు అందజేయడం జరిగిందన్నారు. మండల ప్రత్యేకాధికారి వజ్రశ్రీ, జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారి లక్ష్మణ్, మండల వ్యవసాయ శాఖ అధికారి ఐ.సుబ్రమణ్యం, గ్రామ సర్పంచ్ డబ్బూరి సూర్యప్రకాశరావు, జేసీఎస్ కన్వీనర్ వెంకట్, ప్రజలు పాల్గొన్నారు.



పెదకాకానిలో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎంపీపీ శ్రీనివాసరావు



సచివాలయ సిబ్బందికి మెమెంటో అందజేస్తున్న జెడ్పీటీసీ గుల్జార్ బేగం



సర్టిఫికెట్లు అందజేస్తున్న జెడ్పీటీసీ తుమ్మల సుబ్బారావు

ప్రజా సంక్షేమమే జగనన్న లక్ష్యం

గుంటూరు రూరల్: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే మేకతోటి సుచరిత పేర్కొన్నారు. మంగళవారం నగర శివారులోని 48వ డివిజన్ రెడ్డిపాలెంలో జరిగిన జగనన్న సురక్ష శిబిరంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇటీవల అకాల మృత్యువాతకు గురైన డివిజన్ కార్పొరేటర్ తన బుద్దు కృష్ణారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం జగనన్న సురక్ష సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హత ఉంటే చాలు సంక్షేమ పథకం ఇంటికి చేరినట్టేటనన్నారు. జగనన్న పాలనలో అమ్మ కడుపులోని పాపాయి నుంచి ఆశీర్వదించే అవ్వాతాతల వరకు సంక్షేమ పథకాలను అందుతున్నాయన్నారు. కొన్ని సాంకేతిక కార్యణాల వల్ల ఇంకా పథకాలు అందని వారికి వలంటీర్లు సర్వే నిర్వహిచి అందించేందుకు జగనన్న సురక్ష శిబిరం చేపట్టినట్లు తెలిపారు. రెడ్డిపాలెం వార్డ్ పరిధిలో 1,300 మంది అర్జీదారులకు పలు రకాల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్డిపాలెంలోని వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకులు, అనుబంధ విభాగాల నాయకులు, డైరెక్టర్లు, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన ఖోఖో పోటీలు



గుంటూరు వెస్ట్ (క్రీడలు): క్రీడా సాధనతో చక్కని ఆరోగ్యమేకాకుండా జీవితంలో ఎదురయ్యే సమస్యలను ఎలా అధిగమించాలో తెలుస్తుందని పొన్నూరు శాసన సభ్యుడు కిలారి రోశయ్య తెలిపారు. మంగళవారం స్థానిక విద్యానగర్‌లోని లిటిల్ ఫ్లవర్ ఈఎం స్కూల్లో ఆంధ్ర, తెలంగాణ స్థాయి అండర్–14, 17, 19 ఖోఖో పోటీలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే రోశయ్య మాట్లాడుతూ పోటీలో విజయాలు సాధించడకంటే పోటీల్లో పాల్గొనడమే ప్రధానంగా భావించాలన్నారు. విజయం సాధించే ముందు పొందే ఓటములే ఉన్నత జీవితానికి పునాదులన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల్ని క్రీడలవైపు ప్రోత్సహించాలని కోరారు. బిషప్ మాట్లాడుతూ ఈ పోటీలు 3 రోజుపాటు కొనసాగుతాయన్నారు. సుమారు 600 మంది వీటిలో పాల్గొంటారని చెప్పారు. అనంతరం వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. స్కూల్ సిస్టర్ హెలెన్, ప్రిన్సిపాల్ ఫాదర్ భరత్ రెడ్డి, సవేరి, ఆచార్య సురేష్ కుమార్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆగస్టు 12న దళిత నాయకుల సమావేశం

నెహ్రూనగర్: దళితులపై జరుగుతున్న దాడులు ఖండించేందుకు, వారి హక్కులను కాపాడేందుకు ఆగస్టు 12న విజయవాడలో అన్ని దళిత సంఘాల నాయకులతో, పార్టీలతో సమావేశం నిర్వహించి పలు తీర్మానాలు చేయనున్నట్లు మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ల అరుణ్‌కుమార్ తెలియజేశారు. ఈ మేరకు మంగళవారం అరండల్‌పేటలోని ఓ హోటల్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వివిధ సంఘాల నాయకులు చార్వాక, మల్లెల వెంకట్రావు, జాన్‌పాల్, స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

రైతు దీక్ష భగ్నం

గుంటూరు వెస్ట్: గుంటూరు చానల్‌ను పర్చూరు వరకు పొడిగించాలని గత 20 రోజుల నుంచి స్థానిక కలెక్టరేట్ ఎదుట నిరవధిక దీక్ష చేస్తున్న నల్లమడ రైతు సంఘం నాయకులతోపాటు ఇతర సంఘాల నాయకులను మంగళవారం పోలీసులు అరెస్ట్ చేసారు. దీంతోపాటు వారి టెంట్‌ను కూడా తీసేసారు. ఈ క్రమంలో ప్రతిఘటించిన రైతు సంఘం నాయకులను పోలీసులు శాంతియుత ధోరణిలో అరెస్ట్ చేశారు. నిరసన దీక్షలో ఉన్న కొందరు మహిళలు తీవ్రంగా ప్రతిఘటించారు. వారిని మహిళా పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

విజ్ఞాన్ వర్శిటీ ప్రొఫెసర్‌కు రూ.20 లక్షల సీఎస్ఐఆర్ ప్రాజెక్ట్

చేబ్రోలు: వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్శిటీలోని స్కూల్ ఆఫ్ బయోటెక్ అండ్ ఫార్మాస్యూటికల్స్ విభాగంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ విభాగానికి చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ కె.శ్రీకాంత్‌కి న్యూఢిల్లీలోని సీఎస్ఐఆర్ (కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్) నుంచి రూ.20.14 లక్షల విలువ గల ప్రాజెక్టు మంజూరైందని వర్శిటీ వైస్ చాన్సలర్ పి.నాగభూషణ్ మంగళవారం తెలిపారు. ''మోనిటరింగ్ అండ్ మ్యాపింగ్ ఆఫ్ మైక్రో ప్లాస్టిక్ కంటామినేషన్ ఇన్ చిలికా లేక్ ఎకోసిస్టమ్ ఒడిశా, ఇండియా'' అనే అంశంపై పరిశోధనకు గాను రాబోయే మూడేళ్లకు ప్రాజెక్ట్ గ్రాంటు మంజూరైందన్నారు. సీఎస్ఐఆర్ ప్రాజెక్ట్ గ్రాంట్ సాధించిన ప్రొఫెసర్ కె.శ్రీకాంత్‌ను విజ్ఞాన్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు, వీసీ పి.నాగభూషణ్ తదితరులు అభినందించారు.



గ్రాంట్ సాధించిన అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీకాంత్‌ను అభినందిస్తున్న లావు శ్రీకృష్ణదేవరాయలు

అర్చకుల వేతనం పెంపునకు కృషి

గుంటూరు ఈస్ట్: కొత్తపేటలోని దేవదాయ, ధర్మాదాయ శాఖ కార్యాలయంలో జిల్లా అసిస్టెంట్ కమిషనర్ బొంతు మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఈఓలు, అర్చకులు, సిబ్బందికి మంగళవారం సమావేశం నిర్వహించారు. మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ అర్చకులకు రైతు భరోసా కింద వచ్చే ప్రతిఫలాన్ని అందేలా చూడాలన్నారు. అన్యాక్రాంత భూములను గుర్తించి స్వాధీనం చేసుకునేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అర్చకులకు కనీస వేతనం పెరిగేలా చూడాలన్నారు. రూ. 5వేలు జీతం వచ్చేవారికి రూ. 10వేలు, రూ. 10వేలు జీతం వచ్చేవారికి రూ. 15వేలకు జీతాలు పెంచాలన్నారు. అర్హులైన అర్చకులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలన్నారు. ఇల్లు నిర్మించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జగనన్న కాలనీ పథకంలో, దేవదాయ శాఖకు చెందిన భూముల్లో ఇళ్లు నిర్మించి ఇచ్చేలా కృషి చేయాలన్నారు. భూముల వివరాలు సర్వే నంబర్లతో సహా వెబ్‌సైట్‌లో అప్‌లోడు చేయాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, ఆర్.రమణమ్మ, ఈఓలు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

మంగళగిరి: పట్టణ వాసుల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) తెలిపారు. నగరంలోని తాగునీటి పథకం ఆవరణలో నిర్మాణంలో ఉన్న రా వాటర్ పంప్ హౌస్‌తో పాటు స్విమ్మింగ్ పూల్, స్కేటింగ్ ట్రాక్ పనులను ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలసి పరిశీలించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ డీఈ కృష్ణారెడ్డి, జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, పట్టణ జేసీఎస్ కన్వీనర్ ఎండీ ఫిరోజ్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో సిబ్బంది కొరత లేకుండా చర్యలు

నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో సిబ్బంది కొరత లేకుండా చర్యలు తీసుకోనున్నట్లు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) తెలిపారు. మంగళవారం నగరంలోని ఆటోనగర్‌లోని ఆయన కార్యాలయంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలసి నియోజకవర్గ ఎంఈఓలతో సమావేశం నిర్వహించారు. ప్రతి పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్, ప్యూన్‌లను నియమిస్తామని తెలిపారు.

నిబంధనలకు అనుగుణంగా నిర్మాణాలు ఉండాలి

- లేకుంటే చర్యలు తప్పవు
- నిర్మాణంలో ఉన్న అపార్ట్‌మెంట్లను పరిశీలించిన నగర కమిషనర్ కీర్తి చేకూరి



ప్లాన్ కాపీలను పరిశీలిస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: నగరంలో బహుళ అంతస్తు నిర్మాణాలు నిబంధనలకు అనుగుణంగానే నిర్మాణం చేయాలని, నిబంధనలు పాటించని వాటికి ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ జారీ చేయబోమని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. మంగళవారం నవభారత్ నగర్, జేకేసీ రోడ్, ఇన్నర్ రింగ్ రోడ్ తదితర ప్రాంతాల్లో ఆక్యుపెన్సీ సర్టిఫికెట్‌కి దరఖాస్తు చేసుకున్న భవనాలను పరిశీలించి, పట్టణ ప్రణాళిక అధికారులకు తదుపరి అనుమతులపై తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల మేరకు మాత్రమే నగరంలో బహుళ అంతస్తు భవనాలు నిర్మాణాలు జరగాలని, నిబంధనలు ఉల్లంఘన చేస్తే తగిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. ఎల్‌టీపీలు నూతనంగా బహుళ అంతస్తు భవనాలకు అనుమతుల కోసం ఆన్‌లైన్ ద్వారా డి.పి.ఎం.ఎస్.లో తప్పనిసరిగా నిర్దేశిత ధ్రువ పత్రాలు, నిబంధనలకు అనుగుణంగా దరఖాస్తు చేసుకోవాలని, లేకుంటే తదుపరి అనుమతుల జారీ నిలిపివేయడం జరుగుతుందన్నారు. సెట్ బ్యాక్ పోర్షన్‌లో, రోడ్ వైడెనింగ్ పోర్షన్‌లో ఎటువంటి నిర్మాణం చేసినా, నిర్ణీత ఎత్తు మించినా కూడా ఆక్యుపెన్సీ ఇవ్వడం జరగదన్నారు. ర్యాంప్‌లు రోడ్ మీదకు రాకుండా చూడాలని, అనుమతి పొందిన ప్లాన్ ప్రకారం గ్రీనరీకి కేటాయింపు ఉండాలన్నారు. రెయిన్ వాటర్ హార్వెస్ట్ పిట్‌లు నామమాత్రం కాకుండా పక్కాగా పని చేసేలా కనెక్షన్ చేయాలన్నారు. ర్యాంప్‌లు రోడ్ల మీదకు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నిర్మాణాలు జరిగే సమయంలోనే వార్డ్ సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు నిర్దేశిత అనుమతి పొందిన ప్లాన్ ప్రకారం నిర్మాణం జరుగుతున్నదీ లేనిదీ పరిశీలించాలని ఆదేశించారు. ప్లానింగ్ కార్యదర్శులు తప్పనిసరిగా భవన నిర్మాణ అనుమతులు, ప్రణాళిక విభాగానికి సంబంధించిన నిబంధనలు, చట్టాలపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలన్నారు. అసిస్టెంట్ సిటీ ప్లానర్ అజయ్ కుమార్, టీపీఎస్ గోవర్ధన్, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్ పాలన అద్భుతం

- విద్య, వైద్యరంగాల్లో రాష్ట్రం ముందంజ
- కన్యకాపరమేశ్వరి అమ్మవారిని దర్శించుకున్న మాజీ క్రికెటర్ అంబటి రాయుడు



అమ్మవారిని దర్శించుకున్న మాజీ క్రికెటర్ అంబటి తిరుపతి రాయుడు

పాత గుంటూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో విద్యా, వైద్యరంగంలో ఎన్నో అద్భుతాలు జరిగి రాష్ట్రం అభివృద్ధి చెందుతోందని మాజీ క్రికెటర్ అంబటి రాయుడు అన్నారు. మంగళవారం ఆర్.అగ్రహారంలోని కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానాన్ని ఆయన సందర్శించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవస్థానం పాలకమండలి చైర్మన్ నిడమానూరి సురేష్, సభ్యులు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాయుడికి స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంబటి రాయుడు విలేకరులతో మాట్లాడుతూ ప్రజా సంక్షేమాన్ని కోరుతూ అమ్మవారిని దర్శించుకోవడం జరిగిందన్నారు. సీఎం ఆదేశానుసారం రాష్ట్రంలో క్రీడల అభివృద్ధిపై దృష్టి సారిస్తానన్నారు. రాష్ట్రంలో నాలుగు క్రికెట్ అకాడమీలు మంజూరయ్యాయని తెలిపారు. ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు ప్రజల్లోకి వస్తున్నానని అన్నారు. సొంత జిల్లా కావడంతో అన్ని ప్రాంతాల్లో పర్యటనలు చేస్తున్నానని పేర్కొన్నారు. అనంతరం కూరగాయల మార్కెట్లో పర్యటించి వ్యాపారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్ సీపీ నాయకురాలు షేక్ నూరి ఫాతిమా, కార్పొరేటర్ సంకూరి శ్రీనివాసరావు, ఆలయ సభ్యులు కనమర్లపూడి మారుతి శివ వెంకట సుబ్బారావు, దేవరశెట్టి సురేష్ బాబు, బైసాని ఇందుమతి, కొలిశెట్టి రమాదేవి పాల్గొన్నారు.

గుంటూరు మార్కెట్‌లో సందడి...

పట్నంబజారు: నగరంలోని మార్కెట్ ప్రాంతంలో ప్రముఖ క్రికెటర్ అంబటి రాయుడు మంగళవారం సందడి చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత షేక్ నూరిఫాతిమాతో కలిసి పర్యటించారు. స్థానికంగా ఉన్న వ్యాపారులతో మాటామంతీ కలిపారు. సరదాగా వారితో ముచ్చటించి.. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల గురించి చిరు వ్యాపారులతో చర్చించారు.

అన్నీ వలంటీర్లే చేసి పెడుతున్నారయ్యా..


మార్కెట్‌లో పర్యటించిన అంబటి రాయుడితో చిరువ్యాపారులు తమ మనోభావాలు పంచుకున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక తమ జీవితాల్లో ఎన్నో మార్పులు వచ్చాయని ఉద్వేగభరితంగా చెప్పుకొచ్చారు. కనీసం సంతకం కూడా పెట్టడం రాని మాకు.. వలంటీర్లు అన్ని విషయాన్ని కూలకుషంగా వివరించి.. ఆఖరికి బ్యాంకుల్లో అకౌంట్లు కూడా తెరిపించి.. ప్రతి పథకం అందేలా చూస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు.

సచివాలయాలు, వలంటీర్లు వ్యవస్థ ద్వారా మా కుటుంబాలకు ఎంతో మేలు జరుగుతోందని.. గతంలో మాదిరిగా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పని లేకుండా.. ఏ పని ఉన్నా.. రోజుల వ్యవధిలో జరిగిపోతోందని వివరించారు.

రాష్ట్ర ప్రభుత్వంపై ఎంతో నమ్మకం : అంబటి రాయుడు

మార్కెట్‌లో పర్యటన అనంతరం అంబటి రాయుడు మీడియాతో మాట్లాడారు. తాను చిరు వ్యాపారులతో కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకోవటం జరిగిందని, రాష్ట్ర ప్రభుత్వం వారికి అన్ని విధాలుగా అండగా ఉంటోందని సంతోషాన్ని వ్యక్తం చేశారన్నారు. అదేవిధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిరువ్యాపారులకు అందించిన రుణాలు, వారి కుటుంబాలకు అందుతున్న సంక్షేమ పథకాల గురించి తెలియజేయటంతో పాటు, తమ కుటుంబాలు ఆనందంగా జీవిస్తున్నాయని చెప్పారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు, కార్పొరేటర్లు, పార్టీ అనుబంధ విభాగాల నేతలు తదితరులు పాల్గొన్నారు.

ప్రముఖ పసుపు వ్యాపారి జంపాల మృతి



దుగ్గిరాల(తెనాలి): ప్రముఖ పసుపు వ్యాపారి జంపాల వెంకట కృష్ణారావు(82) మంగళవారం సాయంత్రం మృతి చెందారు. ఆయన కొన్ని రోజులుగా అనారోగ్యంతో ఉన్నారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పసుపు వాణిజ్య కేంద్రమైన దుగ్గిరాలలో ప్రముఖ వ్యాపారుల్లో వెంకట కృష్ణారావు ఒకరుగా గుర్తింపు పొందారు. గ్రామ రాజకీయాలపై ఆసక్తితో 40 ఏళ్ల క్రితం గ్రామ సర్పంచిగా పోటీచేసి భారీ మెజారిటీతో గెలుపొందారు. రెండో సార్లు సర్పంచిగా పనిచేశారు. దుగ్గిరాల మండల పరిషత్ ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. రాష్ట్ర ఆర్థిక సంఘం సభ్యుడిగానూ వ్యవహరించారు. తెనాలిలోని ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీ కమిటీలోనూ కృష్ణారావు కొనసాగారు. ఆయన అంతిమ యాత్రను బుధవారం నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. దుగ్గిరాల మార్కెట్ యార్డుకు సెలవు ప్రకటించారు.